జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM
గురువారం
05 02 2026
సంపుటి 1 సంచిక 75
పేజీలు : 04
PRGI No :
TGTEL/25/A4195



# "అభివృద్ధే మా అజెండా.. గెలుపే మా లక్ష్యం"

## మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి

### మున్సిపల్ ఎన్నికల వేళ ఇబ్రహీంపట్నంలో బిఆర్ఎస్ దూకుడు

**దశ, రంగారెడ్డి**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ఎన్నికల వాతావరణం ఊపందుకుంది. ఈ క్రమంలో బిఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) పార్టీ తరఫున రాష్ట్ర నాయకులు మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి బుధవారం పలు వార్డులలో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి తలుపు తట్టుతూ ప్రజలతో మమేకమై మాట్లాడిన ప్రశాంత్ రెడ్డి, గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా వివరించారు. "మాటలు కాదు - పని చేసే పార్టీ బిఆర్ఎస్" అనే నినాదాన్ని ప్రజల్లో బలంగా నాటే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అభివృద్ధిలో టిఆర్ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, పారిశుధ్య సేవల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అలాగే రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తుచేశారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రజలను ఆదుకున్న ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. విపక్షాలపై పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ, "ఎన్నికలు వస్తేనే కనిపించే నాయకులు కాదు... ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండే పార్టీ బిఆర్ఎస్" అని వ్యాఖ్యానించారు. అభివృద్ధిని అడ్డుకునే శక్తులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే, మరింత వేగంగా అభివృద్ధి పనులు చేపడతామని, ప్రతి వార్డుకు ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఇంటింటి ప్రచారంలో పార్టీ నాయకులు, స్థానిక కార్పొరేటర్ అభ్యర్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బిఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తుండగా, ప్రచారానికి ప్రజల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. మొత్తానికి ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకత్వం వ్యూహాత్మకంగా ముందుకెళ్తుందనడంలో సందేహం లేదని స్థానికుల అభిప్రాయం.







# నిజామాబాద్‌లో కాంగ్రెస్ ప్రచార హోరు

## 19వ డివిజన్‌లో శమంత నరేందర్ రెడ్డి ఇంటింటి ప్రచారం

### "అందుబాటులో ఉండే కార్పొరేటర్‌గా సేవలు"

**దశ,,నిజామాబాద్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ నగర రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ క్రమంలో నిజామాబాద్ 19వ డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా బరిలో ఉన్న శమంత నరేందర్ రెడ్డి బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ముందుగా 19వ డివిజన్ పరిధిలోని శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన శమంత నరేందర్ రెడ్డి, అనంతరం డివిజన్ పరిధిలోని కంఠేశ్వర్ పరిసర ప్రాంతాలు, భూపాన్‌పల్లి శివారు ప్రాంతాలు, పలు కాలనీలలో కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, కాంగ్రెస్ పార్టీకి, తనకు ఓటు వేసి గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. కాలనీలో సుపరిచితురాలిగా ఉన్న శమంత నరేందర్ రెడ్డి, తన కుటుంబం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నదని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్పొరేటర్‌గా గెలిచిన వెంటనే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని, డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టిసారిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల వద్దకు వెళ్లే నాయకురాలిగా, సమస్య తెలిసిన వెంటనే సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ అధికార పార్టీ కావడంతో డివిజన్ అభివృద్ధికి అధిక నిధులు వచ్చే అవకాశం ఉందని, 19వ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మహిళలకు కల్పిస్తున్న అవకాశాలు, పేదల అభివృద్ధి కార్యక్రమాలు గురించి ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అదే నమ్మకంతో తనకు ఓటు వేయాలని కోరారు.

ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఈ ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపిస్తే 19వ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని శమంత నరేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు. నిజామాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ముందుకు సాగుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## రంగారెడ్డి జిల్లాలో మహిళా న్యాయవాది దారుణ హత్య



**దశ, రంగారెడ్డి:** మొయినాబాద్ శివారులోని పొలం వద్ద చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవాది స్వప్నను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసారు. న్యాయవాది హత్య కేసులో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ముందు న్యాయవాదులు ధర్నాకు దిగారు. ఈ నేపథ్యంలో బీజాపూర్ హైవే పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదుల డిమాండ్ చేశారు.

## వాదించే గొంతుకను నొక్కేస్తారా?

### స్వప్న మృతిపై న్యాయవాదుల ఆగ్రహం!

**దశ, రంగారెడ్డి :** న్యాయం కోసం గళమెత్తే న్యాయవాదికే రక్షణ లేకపోవడం ఈ సమాజానికే మచ్చ అని TPCC లీగల్ సెల్ కన్వీనర్ సత్యనారాయణ గుండ్లపల్లి మండిపడ్డారు. చేవెళ్ల యువ న్యాయవాది స్వప్న దారుణ హత్యను నిరసిస్తూ బుధవారం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల పక్షాన కోర్టుల్లో వాదించే అడ్వకేట్లపై దాడులు పెరగడం ఆందోళనకరమన్నారు. ఒక మహిళా న్యాయవాదిని ఇంత ఘోరంగా హత్య చేయడం న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు వృత్తిపరమైన భద్రత కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే *'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్'*ను అమలులోకి తీసుకురావాలన్నారు. స్వప్న హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి, నిందితులకు తక్షణమే ఉరిశిక్ష పడేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే మహిళా న్యాయవాదుల రక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా TPCC లీగల్ సెల్ వైస్ చైర్మన్ దేవులపల్లి సంతోష్ కుమార్, కన్వీనర్ P R V ప్రసాద్, సభ్యులు ఎం. సత్యనారాయణ, ఎస్. లక్ష్మయ్య, రమ్య, జీవన్, ఉమేష్ పాల్గొన్నారు.



## పాత తరం పాత్రికేయులను మార్గదర్శకంగా తీసుకోవాలి: గుత్తా



**దశ, హైదరాబాద్:** తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయులపై అకాడమీ ప్రచురించిన చిరు పుస్తకాల (మెనోగ్రాఫ్స్) ఆవిష్కరణ, ఇటీవల మరణించిన పాత్రికేయుల కుటుంబాల పెన్షన్ చెక్కుల ప్రదాన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, విద్యా, ప్రజా వ్యవహారాల సలహాదారు కె. కేశవరావు, తెలంగాణ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ మెనోగ్రాఫ్స్ పుస్తకాలు యువ జర్నలిస్టులు చదవాలి. సీనియర్ పాత్రికేయుల అనుభవాలు , ఆలోచనలు ఈ పుస్తకంలో పొందుబరిచారు. ఇది నేటి జర్నలిస్టులకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. పాత్రికేయులుగా పని చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు మీడియా అకాడమీ అండగా నిలవడం అభినందనీయం. వారి కుటుంబాలకు అండగా ఉన్నామని చెప్పేందుకు పెన్షన్ ఇస్తున్నారు. పాత్రికేయ రంగం అంటే ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. సోషల్ మీడియా వచ్చాక వారిపై మరింత ఒత్తిడి పెరిగింది. సమాజంలో మార్పు తీసుకురావడంలో పాత్రికేయులది కీలక పాత్ర. పాత తరం పాత్రికేయులను మార్గదర్శకంగా తీసుకొని కొత్తవారు ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాన్నారు.

## నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే..

### సంజయ్ కుమార్



**దశ, జగిత్యాల:** నేను బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచిన.. ఇప్పుడు కూడా నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనేనని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శాలువ కప్పుకున్నా. అంతే. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు.. రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని అన్నారు. నేను బీఆర్ఎస్ పార్టీకి నెలకు రూ.5 వేలు కడుతున్నా.. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు అఫిడవిట్ ఇచ్చానని అన్నారు.



## చదువుల విప్లవానికి శ్రీకారం.. మహిళా సమాఖ్యకు ఊతం!

### మిర్యాలగూడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన

మిర్యాలగూడలో రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన - ప్రగతి బాట' కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నీలగిరి జిల్లా మహిళా సమాఖ్యకు రూ. 1138 కోట్ల చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం పంపిణీ, బోనస్, ఉచిత విద్యుత్ పథకాల గురించి ప్రస్తావిస్తూ, దేశంలోనే రైతుల సంక్షేమానికి అత్యధికంగా ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

( దశ మిర్యాలగూడ )






నిరసనలో పాల్గొన్న విద్య రెడ్డి తదితరులు

# రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలి

**దశ, ఎల్‌బీనగర్:** పార్లమెంట్ లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంపై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ సచివాలయం ముందు ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శివ చరణ్ రెడ్డి, శక్తి సూపర్ షి స్టేట్ కో ఆర్డినేటర్ విద్య రెడ్డి లు మాట్లాడుతూ... ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ,హోంమంత్రి అమిత్ షాల చీకటి ఒప్పందాలు భారతదేశ ప్రజలకు రాహుల్ గాంధీ తెలియజేసే ప్రయత్నాన్ని కుట్ర పూరితంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అమెరికా, చైనా దేశాలతో జరిగిన ఒప్పందాలను బయటకు తెలియజేసేందుకు రాహుల్ గాంధీ ఉంటే , ఆయనను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు ఈ కుట్రలను అన్ని గమనిస్తున్నారని , మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గరపడ్డాయని జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. నిరసన కార్యక్రమంలో కో ఇంచార్జులు రోష్ని జైస్వాల్, భవ్యా, లీగల్ సెల్ చైర్మన్ నిఖిల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యాం చరణ్ రెడ్డి లతో పాటు పెద్ద ఎత్తున యూత్ కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# స్నాతకోత్సవాల్లో తగ్గనున్న 'మెరుపు'



## బంగారం ధర పెరుగుదలతో వర్సిటీలకు కొత్త కష్టాలు..!

## వర్సిటీల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు తగ్గుతున్న బహూకరించే బంగారు పతకాల బరువు

**దశ, హైదరాబాద్:** భారీగా పెరుగుతున్న బంగారం ధరలు తెలంగాణలోని వర్సటీలకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టాయి. ధరలు పెరుగుతుండటంతో విద్యార్థులకు ఇచ్చే బంగారం పథకాల తయారీకి అధిక వ్యయం అవుతోంది. దీంతో డిపాజిట్ మొత్తాన్ని పెంచాలని కోరుతూ వర్సటీ అధికారులు దాతలకు లెటర్లు రాస్తున్నారు. దాంతో పాటుగా గోల్డ్ మెడల్స్ తయారీలో గోల్డ్ వినియోగాన్ని గ్రాము వరకు తగ్గించి ఇతర లోహాలను కలిపి తయారు చేయిస్తున్నారు.బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత వారం క్రితం అయితే రికార్డు స్థాయికి ధర చేరుకుంది.సామాన్యులు బంగారం, వెండి కొనుగోలు చేయాలంటేనే వణికిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్టుగా.. బంగారం ధర పెరగటంతో వర్సటీలకు కొత్త కష్టాన్ని తెచ్చిపెట్టింది.గత కొన్నిరోజులుగా బంగారం ధరలు ఆకాశమే హద్దుగా అనూహ్యంగా పెరగడంతో వర్సటీల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించే బంగారు పతకాల బరువు క్రమంగా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్సటీలు అ ప్ర మ త్త మ య్యా యి . ప త కా ల ను ప్రవేశపెట్టిన దాతలకు డిపాజిట్ నిధి మొత్తాన్ని పెంచాలని లేఖలు రాసేందుకు రెడీ అవుతున్నాయి.మార్చి 7న జేఎన్‌టీయూహెచ్ 14వ స్నాతకోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో డిపాజిట్ పెంచాలని లెటర్స్ రాస్తున్నారు.

ఇక గత ఏడాది జూన్‌లో జరిగిన 13వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు బహుకరించే 20 గ్రాముల పతకంలో వెండి, రాగితోపాటు మూడు గ్రాముల బంగారం వినియోగించారు. ఈసారి బంగారం పరిమాణాన్ని మూడు నుంచి రెండు గ్రాములకు తగ్గించారు. ఆ మేరకు వెండి, రాగిని పెంచినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 71 పతకాలను ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించనున్నారు. అందులో కొన్నింటిని వర్సిటీలు సొంత నిధులతో ప్రవేశపెట్టగా.. మరికొన్నింటిని దాతల సహకారంతో సమకూరుస్తున్నారు. గత అక్టోబరులో పాలమూరు వర్సిటీ స్నాతకోత్సవం నిర్వహించారు.అందులో 20 గ్రాముల పతకంలో 0.9 గ్రాముల బంగారం, 17.10 గ్రాముల రాగి, రెండు గ్రాముల వెండి వడినట్లు పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.రమేశ్‌బాబు వెల్లడించారు. ఒక్కో పతకానికి రూ.15 వేల వరకు ఖర్చు అయినట్లు తెలిపారు. ప్రస్తుతం దాతలు పతకాన్ని ప్రవేశపెట్టాలంటే ఆయా వర్సిటీలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ముందస్తు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వాటిని ఎండోమెంట్ మెడల్స్‌గా పిలుస్తారు. డిపాజిట్ చేసిన మొత్తంపై వచ్చే వడ్డీతో బంగారు పతకాలు తయారు చేసి స్నాతకోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేస్తుంటారు. బంగారం ధర ఊహకందని విధంగా భారీగా పెరిగిపోతుండటం.. వచ్చే వడ్డీ సరిపోవటం లేదు. దీంతో కొన్ని వర్సిటీలు మరికొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలని దాతలకు లేఖలు రాస్తున్నాయి. జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా వర్సిటీలో డిపాజిట్ మొత్తం రూ.5 లక్షల వరకు ఉండగా.. పాలమూరు, నల్గొండలోని మహాత్మా గాంధీ వర్సిటీల్లో మాత్రం రూ.2 లక్షలు ఉంది. ఇక నుంచి వర్సటీల్లో కొత్తగా పతకాలు ప్రవేశపెట్టే వారి నుంచి రూ.3 లక్షలు తీసుకోవాలని పాలమూరు, గాంధీ వర్సిటీలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాయి.

# గేమ్ లాస్ట్ టాస్క్... ఆత్మహత్యే.

**దశ, హైదరాబాద్:** తన కూతుళ్లు రెండున్నరేళ్లుగా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసయ్యారని, ఆ గేమ్‌లలో చివరి టాస్క్ సూసైడ్ అని ఉందని దర్యాప్తు అధికారులు తమతో చెప్పారని ఘజియాబాద్ లో ఆత్మహత్య చేసుకున్న ముగ్గురు అక్కాచెల్లెళ్ల తండ్రి మీడియాకు తెలిపారు. యూపీలోని ఘజియాబాద్‌లో గల తొమ్మిది అంతస్తుల అపార్టుమెంట్ నుంచి ముగ్గురు మైనర్ అక్కా చెల్లెళ్లు పాఖీ (12), ప్రాచి (14), విశిక (16) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆన్‌లైన్ కొరియన్ టాస్క్ ఆధారిత గేమ్‌కు బానిసైన వారు "క్షమించండి, నాన్నా" అంటూ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నారు.ఈ కొరియన్ ఆన్‌లైన్ గేమ్‌లో చివరి టాస్క్ ఆత్మహత్య అని తండ్రి మీడియాకు తెలిపారు. రెండున్నరేళ్లుగా ఈ గేమ్‌కు బానిసైన తన కూతుళ్లు క్రమంగా కుటుంబానికి కూడా దూరమయ్యారని అన్నారు. వారి వద్ద ఎప్పుడూ ఫోన్లు ఉండేవని, గదుల్లోనే ఉంటూ గేమ్ ఆడేవారని తెలిపారు. వారిలో ఒకరు ఇన్‌స్ట్రక్టర్‌గా ఉంటే, మిగతా ఇద్దరూ ఆదేశాలను పాటించే వారని తెలిపారు.బుధవారం తెల్లవారుజామున ముగ్గురు అక్కాచెల్లెళ్లు బాల్కనీలోకి వెళ్లి తలుపు గడియ వేసి కిటికీలో నుంచి కిందకు దూకారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ బాలికలు కిందపడిపోవడాన్ని తాను ప్రత్యక్షంగా చూసినట్లు పక్క ఫ్లాట్ వ్యక్తి వెల్లడించారు.రాత్రి రెండు గంటల సమయంలో నేను బాల్కనీలోకి వచ్చానని ఆ సమయంలో వారు బాల్కనీలోనే ఉన్నారని, కానీ అక్కడ కూర్చున్నది ఎవరో తనకు అర్థం కాలేదని తెలిపారు. ఆ తర్వాత వారు కిందకు దూకుతుండటం చూసి కుటుంబ సభ్యులను అప్రమత్తం చేసేలోపు ఒకరి తర్వాత ఒకరు దూకేశారని అన్నారు. ఆ తర్వాత తాను పోలీసులకు, అంబులెన్స్‌కు ఫోన్ చేశానని వెల్లడించారు.

# డీఎస్పీ నుంచి సిఐగా డిమోషన్

## ప్రణీత్ రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ



**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఓ డీఎస్పీకి డిమోషన్ ఇచ్చింది. అతడికి డీఎస్పీ హోదా రద్దు చేసి ఇన్‌స్పెక్టర్ స్థాయికి తగ్గిస్తూ హోంశాఖ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దుగ్యాల ప్రణీత్ రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. తక్కువ కాలంలోనే రూల్స్‌కు విరుద్ధంగా డీఎస్పీగా పదోన్నతి పొందటం పాటు.. ప్రొబేషన్ కాలంలోనే విధుల దుర్వినియోగానికి పాల్పడినందుకు గాను సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణీత్‌రావుకు కల్పించిన యాక్సిలరేటెడ్ పదోన్నతి క్యాన్సిల్ అయింది. ఇకపై ఆయన ఇన్‌స్పెక్టర్ హోదాతోనే కొనసాగనున్నారు. సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు మాత్రమే తక్కువ కాలంలో యాక్సిలరేటెడ్ ప్రమోషన్ కల్పించే విధానం తెలంగాణలో అమల్లో ఉంది. అలాంటి కార్యకలాపాల్లో ప్రణీత్ రావు పనిచేయకపోయినా రాజకీయ లబ్ధి కోసం డీఎస్పీగా పదోన్నతి కల్పించడం అప్పట్లోనే కలకలం రేపింది. 2007 ఎస్సై బ్యాచ్‌లో దాదాపు 300 మంది విధులు నిర్వహిస్తుండగా.. ఒక్క ప్రణీత్ రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించారు. ఈ ఘటన వివాదానికి దారితీసింది.

# రేవంత్ బినామీలపై విచారణ చేయాలి: కేటీఆర్

## సీబీఐ, ఈడీ రంగంలోకి దిగి విచారణ చేపట్టాలని డిమాండ్

## 'మూసీ అభివద్ధి పేరుతో 1.5 లక్షల కోట్ల దోపిడీ

## లగచర్లలో అల్లుడి కంపెనీ కోసం ఫార్మా సిటీ పేరుతో స్కాం

**దశ, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డికి చెందిన బినామీ కంపెనీ బాగోతం, ఆయన చేసిన ఫ్రాడ్ ప్రజలకు తెలియకుండా దాచిపెట్టడానికి బీఆర్ఎస్ నేతలకు వరుస నోటీసులు ఇచ్చారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీబీఐ దర్యాప్తునకు ఎన్సీఎల్టీ ఆదేశించిన కేఎల్ఎస్ఆర్ కంపెనీకి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు ఎందుకు ఇచ్చిందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అక్రమ సంపాదన కోసమా, లేక బినామీ కంపెనీకి ప్రాజెక్టుల కోసమా, కమీషన్ల కోసమా అని కేటీఆర్ నిలదీశారు. దీనిమీద సీబీఐ, ఈడీ రంగంలోకి దిగి విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. న్యాయమూర్తిని సైతం ప్రలోభపెట్టాలని చూశారని పేర్కొన్నారు. బినామీ కంపెనీ కాకపోతే నిషేధం ఉన్న కంపెనీకి రేవంత్ రెడ్డి ప్రాజెక్టులు ఎలా కట్టబెట్టారని, ఆయన పాత్ర ఏంటో తేలాలన్నారు.తెలంగాణ భవన్‌లో బుధవారం నాడు కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ అంటూ సంచలన ఆరోపణలు చేశారు. 'మూసీ అభివద్ధి పేరుతో 1.5 లక్షల కోట్ల దోపిడీని అడ్డుకున్నది బీఆర్ఎస్, లగచర్లలో తన సొంత అల్లుడి కంపెనీ కోసం ఫార్మా సిటీ పేరుతో గిరిజనుల మీద దాడి చేస్తే స్కాంను బయటపెట్టింది తామేనన్నారు. హెచ్ఐఎల్‌టీ పేరుతో రూ.5 లక్షల కోట్ల భూ భాగోతాన్ని బయటపెట్టాం, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది అమృత్ లో చేసిన స్కాంను బయటపెట్టాం. ఇటీవల సింగరేణి బొగ్గుగనుల్లో కాంగ్రెస్ మోసాలను బయటపెట్టింది బీఆర్ఎస్ పార్టీ అని కేటీఆర్ అన్నారు. ఇలాంటి స్కాంలు, కుంభకోణాలు బయటపెడుతున్నందున జనవరి 22, 23 తరువాత మొదట హరీష్ రావు, తరువాత నాకు, సంతోష్ కుమార్, పార్టీ అధినేత కేసీఆర్ కు వరుస నోటీసులు ఇచ్చి సిట్ విచారణకు పిలవడంతో మాకు అనుమానం వచ్చింది. అన్ని విషయాలు గమనిస్తే సీఎం రేవంత్ రెడ్డి బినామా బాగోతం బయటపడింది. జనవరి 23న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. KLSR ఇన్‌ఫ్రా అనేది రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ. మాతో ఆధారాలున్నాయి. ఈరోజు ఆయన బినామీ మాస్టర్ అని తేలిపోయింది. బ్లాక్ మెయిల్ చేసి గతంలో సంపాదించిన డబ్బును ఆయన బినామీ కంపెనీలకు తరలిస్తున్నాడు. వేల కోట్ల ప్రాజెక్టులను కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ సహా పలు ప్రాజెక్టులు కట్టబెట్టారు. 2018 సెప్టెంబర్ 27న రేవంత్ రెడ్డి, ఆయన బంధువుల మీద ఐటీ రైడ్స్ జరిగాయి. ఆయన బావమరిది కంపెనీ సాయి మౌర్య ఎస్టేట్స్ వాళ్లు ట్యాక్స్ సరిగ్గా కట్టలేదని ఐటీ తెలిపింది. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ రేవంత్ దని ఇది ఒక ప్రూఫ్. రేవంత్ రెడ్డి తిరుగుతున్న ల్యాండ్ క్రూజర్ కార్ నెంబర్ టీఎస్ o7 ఎఫ్ఎఫ్ 0009 ఇది కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ కంపెనీ పేరిట రిజిస్టర్ అయింది. రేవంత్ కు కారు ఎందుకు కొనిచ్చారంటే వాళ్లు రియల్ ఎస్టేట్, ఇతర లావాదేవీలు చేస్తున్నారు.



## అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేస్తున్న తీరు అర్థరహితం.

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేశారని తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్నతీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టు అని అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితమన్నారు.

# స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదు: జగదీష్ రెడ్డి




**దశ, హైదరాబాద్:** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారిన ఫిర్యాదును డిస్మిస్ చేసిన స్పీకర్ నిర్ణయం పై మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్పందించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదని అన్నారు. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా.. స్పీకర్ కి కనపడకపోవడం విచారకరం, చర్య తీసుకోకపోవడం దురదృష్టకరం. స్పీకర్ ఏకపక్ష నిర్ణయం ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ చర్యల పట్ల ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగా సభలకు, కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరువుతున్నారు.. అది స్పీకర్ కి కనపడలేదు అంటా . స్పీకర్ ఆత్మసాక్షిగా, చట్ట పరంగా నిర్ణయం తీసుకోలేక పోతున్నారు. స్పీకర్ పిటిషన్ను డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధమే. స్పీకర్ వదిలినా కోర్టుల్లో శిక్ష తప్పదు.. వాళ్లను డిస్మిస్ చేయడం ఖాయమని అన్నారు.

# ఐటీ కారిడార్‌లో స్కైవాక్..

## రాయదుర్గ్-టీహబ్ మార్గంలో ఈ కొత్త స్కైవాక్.. స్కైవాక్‌లపై నగరవాసులు హర్షం.

దశ, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఐటీ కారిడార్‌లో సరికొత్త స్కైవాక్ నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. రాయదుర్గ్‌టీహబ్ మార్గంలో ఈ కొత్త స్కైవాక్ నిర్మించాలని భావిస్తున్నారు. స్కైవాక్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదిత మార్గంలో.. ఉన్నతాధికారులతో కలిసి సైబరాబాద్ సీపీ క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్లు దాటేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆ మార్గంలో స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు రెడీ చేశారు.ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న హైదరాబాద్‌లో రోజురోజుకూ జనాభా భారీగా పెరిగిపోతోంది. ఐటీ కారిడార్‌లో నిత్యం లక్షల మంది టెకీలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ఆ మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం.. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు విస్తరణ పనులను ఎప్పటికప్పుడు చేపడుతూనే ఉంది. అయినప్పటికీ జనం, వాహనాల రద్దీతో.. నగరంలో జనం ట్రాఫిక్ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ సమయంలో పాదచారులు నడిచేందుకు, రోడ్డు దాటేందుకు కూడా చాలా కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రద్దీగా ఉండే కీలక ప్రాంతాల్లో స్కైవాక్‌లను ఏర్పాటు చేస్తోంది. విశాలమైన రోడ్లు దాటలేక ఇబ్బంది పడేవారికి.. ట్రాఫిక్ ఉన్న సమయంలో.. పాదచారులు ఈ స్కైవాక్‌లను ఉపయోగించి.. సులువుగా గమ్యాన్ని చేరుకోవచ్చు.ఇప్పటికే



నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్కైవాక్‌లపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సైబరాబాద్‌లోని రాయదుర్గ్‌టీ హబ్ వద్ద కొత్త స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.హైదరాబాద్‌లోని రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల భద్రత, మరింత సౌకర్యంగా నడిచి వెళ్లడం కోసం ఈ స్కైవాక్‌ను నిర్మించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి పోలీస్, ట్రాఫిక్‌ఉ న్నతాధికారులతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్.. క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు.ఈ స్కైవాక్.. రాయదుర్గ్ నుంచి ప్రారంభమై మెట్రో స్టేషన్, ఐకియా ఫ్లైఓవర్, ఐఓసీఎల్ జంక్షన్ మీదుగా టీహబ్వరకు నిర్మించనున్నారు. మెట్రో ప్రయాణికులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, నగరవాసులతో కిక్కిరిసిపోయి ఉండే ట్రాఫిక్, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ స్కైవాక్ ప్రాజెక్టును అధికారులు ప్రతిపాదించారు. ఈ స్కైవాక్ నిర్మాణంతో దాదాపు 30 శాతం ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని అధికారులు ప్రణాళికలు వేశారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహాయంతో ఈ స్కైవాక్ ప్రతిపాదనను అధికారులు రూపొందించారు. ఈ స్కైవాక్ ఫేజ్ 1లో భాగంగా 500 మీటర్ల మేర నిర్మించనున్నారు. ఇక టీహబ్, మైండ్ స్పేస్ సీగేట్‌ను కలుపుతూ 400 మీటర్ల అండర్‌పాస్ నిర్మించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com